సాక్షి
చిత్తూరు

సోమవారం। 25। మార్చి। 2024



నేనున్నానని.. మీకేం కాదని

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రస్తుతం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. పల్లె ముంగిటకే డాక్టర్లు వెళుతున్నారు. - 8లో



క్షయ నివారణే లక్ష్యం

క్షయ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని డీఎంహెచ్ఓ తెలిపారు. చిత్తూరులో క్షయపై అవగాహన ర్యాలీ చేపట్టారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం(సా)	సహర్ మంగళవారం(ఉ)
చిత్తూరు	6.29	4.54
పుంగనూరు	6.31	4.57

న్యూస్‌రీల్

కిక్కిరిసిన కాణిపాకం



భక్తులతో నిండిపోయిన క్యూలైన్లు

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పౌర్ణమి సందర్భంగా అరుణాచలం వెళ్లే వారు, ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి రద్దీ నెలకొనడంతో రూ.150, రూ.100, ఉచిత క్యూలైన్లు, కంపార్ట్‌మెంట్‌లు భక్తులతో నిండిపోయాయి. క్యూ బయట వరకు వచ్చింది. రద్దీ దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన రద్దు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోమవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయప్రయాసలకు ఓర్చి జిల్లా కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓగా రవిరాజు

చిత్తూరు రూరల్: ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓగా రవిరాజును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి అనివార్య కారణాలతో నెల రోజులు సెలవులో వెళ్లారు. ఈ నేపథ్యంలో డీఐఓగా పనిచేస్తున్న రవిరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన సోమవారం ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

కుక్ కమ్ హెల్పర్లపై ఈసీకి ఫిర్యాదు



పార్టీ కండువా వేసుకుంటున్న సికిందర్

నగరి : స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కుక్ కమ్ హెల్పర్లుగా పనిచేస్తూ రాజకీయ పార్టీ కండువా కప్పుకున్న కె.సికిందర్, అతని భార్య అబిదాపై చర్యలు తీసుకోవాలని పుదుపేటకు చెందిన శంకర్ ఈసీకి ఫిర్యాదు చేశారు. వారు పాఠశాలలో మధ్యాహ్న భోజన విభాగంలో పనిచేస్తూ టీడీపీలో చేరినట్టు పేర్కొన్నారు. వీరు విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలను రాజకీయంగా ప్రభావితం చేసే అవకాశం ఉందని, తక్షణం వారిపై చర్యలు తీసుకోవాలని విజయాడలోని ఏపీ ఎలక్షన్ కమిషనర్, జిల్లా కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారికి, డీఈఓకు ఫిర్యాదు చేశారు.

పురాతన నంది విగ్రహం లభ్యం



పుంగనూరు విజయాలాడ్జి వద్ద లభ్యమైన పురాతన నంది విగ్రహం

పుంగనూరు: పట్టణంలోని ఎంబీటీ రోడ్డు బస్టాండు వద్ద గల విజయాలాడ్జి పునాది పనులను ఆదివారం జేసీబీతో చేపడుతుండగా పురాతన నంది విగ్రహం లభ్యమైంది. విషయం తెలుసుకున్న రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం దాన్ని పురావస్తుశాఖ అధికారులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ విషయం పట్టణంలో వ్యాపించడంతో ప్రజలు తండోపతండాలుగా వచ్చి చూసి వెళ్తున్నారు. ఈ ప్రాంతంలో వందల ఏళ్లనాటి పురాతన ఆలయం శిథిలమై ఉంటుందని, అధికారులు మరింతగా పరిశీలిస్తే మరిన్ని విగ్రహాలు బయటపడతాయని పట్టణ ప్రజలు అంటున్నారు.

రూ.3 కోట్ల విద్యుత్ బిల్లుల చెల్లింపు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆదివారం ప్రభుత్వ సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల వసూల్ కేంద్రాలను తెరిచారు. దీంతో మొత్తం 10,074 సర్వీసుదారులు తమ బిల్లులు చెల్లించగా రూ.3 కోట్ల ఆదాయం వచ్చిందని ట్రాన్స్‌కో ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కూడా వసూలు కేంద్రాలు పనిచేస్తాయని వివరించారు.



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న దేవదేవేరులు

● దేదీప్యం

తిరుమల శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలను టీటీడీ వైభవంగా నిర్వహించింది.. ఆదివారం ఐదోరోజు ఉభయ దేవేరీ సమేతంగా తెప్పలపై కొలువుదీరిన శ్రీమలయప్పస్వామిని దర్శించుకుని భక్తకోటి పులకించింది.. పవిత్ర పుష్కరిణిలో ఏడు ప్రదక్షిణలు చేసిన దేవదేవేరులను దివ్యతేజస్సును వీక్షించి పునీతమైంది.. పరిపూర్ణమైన పుణ్యోత్సవంలో పాల్గొని తరించింది.

- తిరుమల



శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి సేవలో టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

మారిన లెక్కలు.. బాబుకు చిక్కులు!



కుప్పం నియోజకవర్గంలో ఏళ్ల తరబడి కొనసాగిన చంద్రబాబు ఆధిపత్యం అంత్య దశకు చేరిందా..? బురిడీ మాటలకు కాలం చెల్లిందా..? దశాబ్దాలుగా మోసిన ప్రజలకు టీడీపీ అధినేత అసలు తత్వం బోధపడిందా..? వాస్తవాలు గ్రహించిన జనంలో మార్పు మొదలైందా..? ఇన్నేళ్లుగా నల్లేరుపై నడకలా సాగిన చంద్రబాబు గెలుపు ఇకపై కష్టంగా మారబోతోందా..? కుప్పంలో మారిన లెక్కలను గమనిస్తే అసలు నిజం అర్థమవుతోంది. స్థానిక.. పురపాలక ఎన్నికల్లో వచ్చిన ఫలితమే మార్పునకు దర్పణం పడుతోంది. అందుకే టీడీపీ అధినేత వరుస పర్యటనలకు వస్తున్నట్లు ఆ పార్టీ క్యాడర్ భావిస్తోంది.

- 35 ఏళ్లుగా మాటలతోనే చంద్రబాబు గారడీలు
- కేవలం నకిలీ ఓట్లతోనే కుప్పంలో వరుస విజయాలు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాస్తవాలు గ్రహించిన ప్రజలు
- స్థానిక ఎన్నికల్లో ఘోరంగా తిరస్కరించిన ఓటర్లు
- సార్వత్రిక సమరంలోనూ ఇదే పునరావృతమవుతుందనే భయంలో తమ్ముళ్లు
- దిక్కుతోచకే చంద్రబాబు తరచూ కుప్పం పర్యటనకు వస్తున్నారంటున్న టీడీపీ నేతలు

సాక్షి, తిరుపతి: కుప్పం నియోజకవర్గ ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పం వాసులు ఇచ్చిన తీర్పే ఇందుకు నిదర్శనం. నేటి పాలనకు.. నాటి టీడీపీ పాలనను బేరీజు వేసుకుంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఐదేళ్లలో డీబీటీ ద్వారా 4,32,067 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో రూ.1,244.23 కోట్లు నేరుగా జమ చేసింది. నాన్ డీబీటీ ద్వారా 3,03,080 మంది లబ్ధిదారులకు రూ.1,175.21 కోట్లు అందించింది. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా, ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్నా చెప్పుకోదగ్గ ఒక్క మంచి పథకం తీసుకురాలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. 35 ఏళ్లుగా కుప్పానికి నీళ్లు తీసుకొస్తా అని చెప్పుకుంటూ వచ్చారే తప్ప మాట నిలబెట్టుకున్న దాఖలాలు లేవు. సీఎం వైఎస్ జగన్ ఐదేళ్లలోనే కుప్పానికి కృష్ణా జలాలను తీసుకువచ్చి స్థానికుల మన్ననలు పొందుతున్నారు.

ఇన్నేళ్లు గెలిపించింది దొంగ ఓట్లే

చంద్రబాబు 1989 నుంచి కుప్పం నుంచి పోటీ చేసి గెలుపొందుతూ వచ్చారు. ఈయన గెలుపునకు కుప్పం వాసుల అమాయకత్వమే కారణమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పక్కనే ఉన్న కర్ణాటక, తమిళనాడుకు చెందినవారిని వేల సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేయించడమే బాబు విజయానికి ప్రధాన కారణంగా ఆరోపిస్తున్నారు. 2014, 2019 ఎన్నికల్లో ఐఏఎస్ అధికారి చంద్రమౌళిని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా చంద్రబాబుపై పోటీకి దింపారు. ఎన్నికల సమయంలో కర్ణాటక, తమిళనాడు నుంచి భారీగా వచ్చి ఓట్లు వేసి వెళ్లడం గమనించిన చంద్రమౌళి దీనిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా ఎన్నికల్లో భారీగా దొంగ ఓట్లు పోలైనట్లు అధికారుల విచారణలో తేలింది. దీంతో 18 వేల ఓట్లు ఒకసారి, 34 వేల ఓట్లు మరోసారి తొలగించారు.

కుప్పం నియోజకవర్గ సమాచారం

2019 ఎన్నికల్లో మొత్తం ఓట్లు	2,13,145
టీడీపీకి పోలైనవి	1,00,164
వైఎస్సార్‌సీపీకి వచ్చినవి	69,426
స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తం ఓట్లు	1,78,948
టీడీపీ	21,038
వైఎస్సార్‌సీపీ	79,633
కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం ఓట్లు	38,213
టీడీపీ	12,377
వైఎస్సార్‌సీపీ	15,696
ప్రస్తుతం ప్రచురితమైన తుది ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలోని మొత్తం ఓట్లు	2,23,174

కుప్పానికి పరుగులు

కుప్పంలో 2014 ముందు ఒక లెక్క ఆ తర్వాత మరో లెక్క అన్న చందంగా మారింది. అప్పటి వరకు అన్ని గ్రామాలు చంద్రబాబు చెప్పిందే వేదంలా.. వేరొకరికి స్థానం లేకుండా భయపెడుతూ.. బెదిరిస్తూ ప్రత్యర్థి లేకుండా జాగ్రత్తపడుతూ వచ్చారు. 35 ఏళ్ల పాటు కుప్పం వాసులను ఆడిస్తూ వస్తున్న చంద్రబాబుకు వైఎస్సార్‌సీపీ ప్రస్థానం ప్రారంభమైన తర్వాత వరుస షాక్‌లు తగలడం మొదలైంది. ప్రతి గ్రామంలో టీడీపీకి పోటీగా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసేవారు ముందుకు వచ్చారు. 2019 తర్వాత జరిగిన స్థానిక సంస్థలు, కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్ అందరూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే విజయం సాధించడంతో చంద్రబాబు మైండ్ బ్లాంక్ అయ్యింది. దీంతో 35 ఏళ్లుగా కుప్పంలో సొంత ఇల్లు నిర్మించుకోవాలనే ఆలోచనే చేయని చంద్రబాబుకు అప్పటికి జ్ఞానోదయమైంది. దీంతో హుటాహుటి ఇంటి నిర్మాణం చేపట్టారు. అలాగే తరచూ కుప్పానికి వస్తున్నారు. 2014–19 మధ్య కాలంలో సీఎం హోదాలో చంద్రబాబు 8 పర్యాయాలు మాత్రమే కుప్పంలో పర్యటించారు. 2019–2024 మధ్య కాలం (నేటి పర్యటనతో కలిపి)లో 13 పర్యాయాలు కుప్పం వచ్చి కనీసం అంటే రెండు, మూడు రోజులు ఉండి వెళ్తున్నారు. ఓటమి భయంతోనే కుప్పానికి పరుగులు పెడుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.



పేదింట్లో విజయానందరెడ్డికి భోజనం

గుడిపాల: వైఎస్సార్ సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి ఆదివారం గుడిపాల మండలం 189 కొత్తపల్లె దళితవాడలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో పూరి గుడిసెలో ఉంటున్న గౌరి ఇంటి వద్దకు వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఆయనను చూసిన గౌరి తమ ఇంట్లో భోజనం చేయమని కోరింది. ఆయన వెంటనే వారి ఇంట్లో కూర్చొని ఆమెతో పాటు భోజనం తిన్నారు. గౌరి ప్రస్తుతం పూరిగుడిసెలో ఉంటోంది. ఆమె భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో రూ.3 వేల పింఛన్‌తో జీవనం సాగిస్తోంది. విజయానందరెడ్డి తన ఇంట్లో తాను వండిపెట్టిన భోజనాన్ని తినడంతో ఆమె ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.



గుడిపాల: గౌరి ఇంట్లో భోజనం చేస్తున్న విజయానందరెడ్డి

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

పుంగనూరు: పట్టణంలోని కోనేటిపాళ్యెంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు స్టార్ అంజప్ప, మేస్త్రీ అంజప్ప, బాబు, రాజా, శ్రీనివాసులు, పూలరాము, పాండు, పులిచెర్ల రవి, యోగనందబాబు తదితరులు 50 మంది ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంజప్ప మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని కొనియాడారు. 30 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలో చేపట్టిన ప్రభుత్వ పనితీరును చూసి పార్టీలో చేరామన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్ గంగులమ్మ, బోయకొండ ఆలయ కమిటీ డైరెక్టర్ రాజేష్ పాల్గొన్నారు.



పుంగనూరులో నాగభూషణం, అలీమ్‌బాషా సమక్షంలో పార్టీలో చేరిన అంజప్ప తదితరులు

ఇంతింతై.. రెట్టింపై!

సార్వత్రిక ఎన్నికల సమరంలో డబ్బు కీలక పాత్ర పాత్ర పోషిస్తుందన్నది ఎవరూ కాదనలేని అంశం! ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు ఇష్టారీతిన డబ్బు ఖర్చు పెట్టడానికి వీలులేదు. ప్రస్తుతం అసెంబ్లీ అభ్యర్థుల వ్యయపరిమితి గరిష్టంగా రూ.40 లక్షలు, పార్లమెంట్ అభ్యర్థులకు రూ.95 లక్షలుగా నిర్ణయించారు. తొలినాళ్లలో అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.లక్ష మాత్రమే ఉండగా ఇంతింతై వటుడింతై అన్నట్లు ఇప్పుడు రూ.40 లక్షలకు చేరింది. 1952లో జరిగిన తొలి ఎన్నికల నుంచి చూస్తే నలభై రెట్లు పెరిగింది.

- పెరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల వ్యయం
- తొలి ఎన్నికల్లో గరిష్ట పరిమితి రూ.లక్ష
- ప్రస్తుతం అసెంబ్లీకి రూ.40 లక్షలు, పార్లమెంట్‌కు రూ.95 లక్షలు
- అభ్యర్థుల ఖర్చు పక్కాగా ఉండాల్సిందే

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి జిల్లా వ్యాప్తంగా ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమయ్యారు. సభలు, ర్యాలీలు, భోజనాలు, వాహనాలు ఇలా ఎన్నో ఖర్చులు ఉంటాయి. ఎన్నికల రణరంగంలో పైచేయి సాధించడానికి అభ్యర్థులు హద్దులు దాటకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను నిర్దేశించింది. వీటిని పక్కాగా అమలు చేసేందుకు ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించింది. వారు నిత్యం షాడోల్లా ఉంటూ అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను లెక్కిస్తారు. హద్దు దాటితే పోటీపై అనర్హత వేటు పడే ప్రమాదమూ ఉంటుంది. జిల్లాలో ఎన్నికల



బరిలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై 'సాక్షి' కథనం.

నామినేషన్ నుంచి అమలులోకి..

ఎన్నికల మార్గదర్శకాల ప్రకారం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఖర్చు లెక్కిస్తారు. అభ్యర్థి ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి లావాదేవీలు నిర్వహించాలి. ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎప్పటికప్పుడు ఖర్చులను నమోదు చేస్తారు.

షాడోలా నిఘా..

నామినేషన్ తర్వాత అభ్యర్థులు చేపట్టే ప్రతి కార్యక్రమాన్నీ పరిశీలకులు పర్యవేక్షిస్తారు. ప్రచారం, సభలు, సమావేశాలకు ముందుగా అనుమతి తీసుకోవాలి. అధికారులు ఆయా కార్యక్రమాలను పరిశీలించి వీడియోలు తీసుకుంటారు. సభలు, సమావేశాలకు చేసిన ఖర్చు, వచ్చిన వాహనాలు, భోజనాల ఖర్చు తదితరాలను లెక్కించి షాడో రిజిస్టర్లో నమోదు చేస్తారు. అభ్యర్థులు పోలింగ్ నాటికి ఖర్చు వివరాలను మూడు పర్యాయాలు అకౌంటింగ్ టీంతో తనిఖీ చేయించుకోవాల్సి ఉంటుంది.

ప్రలోభపెట్టేలా ఖర్చు చేయరాదు..

ఓటర్లను ప్రలోభపెట్టడం, ప్రభావితం చేసేందుకు అభ్యర్థులు ఎలాంటి ఖర్చు చేయరాదు. తనిఖీల్లో పట్టుబడిన నగదు, సామగ్రి అభ్యర్థిదని తేలితే అభ్యర్థుల వ్యయంలో చేరుస్తారు. రోజువారీగా అభ్యర్థుల ఖర్చుతో పాటు పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పోస్టర్లు, టోపీలు, కండువాలు, భోజనాలు, వాహనాల అద్దె, ఇంధనం, సభా వేదికలు, మైకులు, పత్రికలు, టీవీ, సోషల్ మీడియా ప్రకటనలకు చేసే ఖర్చును అభ్యర్థి ఎన్నికల వ్యయంగా లెక్కిస్తారు. వీటిలో ప్రతిదానికీ బిల్లు సమర్పించాలి.

లెక్క చూపకున్నా వేటే..

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే వారి ప్రచారం వ్యయ పరిమితి రూ.40 లక్షల వరకు, పార్లమెంట్ అభ్యర్థులు రూ.95 లక్షల వరకు ఖర్చు చేసుకునే అవకాశం ఉంటుంది. ఫలితాలు వెల్లడించిన తేదీ నుంచి 30 రోజుల్లోపు అభ్యర్థులు తమ పూర్తిస్థాయి ఖర్చు వివరాలను బిల్లులతో సహా అధికారులకు అప్పగించాలి. పరిమితికి మించి ఖర్చు చేసినా, వ్యయానికి సంబంధించిన లెక్కలను సరైన సమయంలో చూపకున్నా వారిపై వేటు పడడంతో పాటు తర్వాతి ఎన్నికల్లో పోటీచేసే హక్కు కోల్పోవాల్సి ఉంటుంది.

పెరుగుతున్న వ్యయ పరిమితి..

1952 సాధారణ ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల వ్యయ పరిమితి రూ.లక్ష ఉండేది. 1962 నాటికి రూ.3 లక్షలకు, 1971 ఎన్నికల్లో రూ.4 లక్షలకు, 1975 నాటికి రూ.5 లక్షలకు చేరింది. 1984 అసెంబ్లీ ఎన్నికల్లో రూ.10 లక్షలకు చేరగా, 1991 నాటికి రూ.12 లక్షలకు పెంచారు. 1999లో రూ.15 లక్షలు, 2004 నాటికి రూ.17 లక్షలు, 2009లో రూ.26 లక్షలు, 2014లో రూ.28 లక్షల పరిమితిని నిర్ణయించారు. ఇది ప్రస్తుత ఎన్నికల్లో రూ.40 లక్షలకు చేరింది.



ప్రతి రూపాయికీ లెక్క తప్పనిసరి..

"ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోటీలో నిలిచే అభ్యర్థులు ప్రతి రూపాయికీ లెక్కలు చూపించాల్సిందే. ఓటర్లను ప్రలోభ పెట్టేలా, ప్రభావితం చేసేలా వ్యవహరించకూడదు. ఎన్నికల నియమావళి ప్రకారం పోటీలో ఉండే వారు ఇష్టారీతిన డబ్బు ఖర్చు పెట్టడానికి వీలు లేదు. అభ్యర్థుల ప్రతి ఖర్చును ఎక్స్‌పెండిచర్ బృందం పర్యవేక్షిస్తుంది.

– సగిలి షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, చిత్తూరు

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ

చౌడేపల్లి : మండలంలోని బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఒక్క రోజే సుమారు 20 వేల మంది అమ్మవారిని దర్శించుకున్నట్టు అధికారులు వెల్లడించారు. అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కోర్కెలు తీరిన వారు పిండి, నూనె దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



విశేషాలంకరణలో గంగమ్మ తల్లి



బోయకొండ ఆలయంలో భక్తుల రద్దీ

దళితుల పక్షపాతి పెద్దిరెడ్డి

పూతలపట్టు: పేద, దళిత వర్గాల పక్షపాతి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అని ఐక్యదళిత మహానాడు జాతీయ అధ్యక్షుడు కల్లూరి చెంగయ్య తెలిపారు. ఆయన ఆదివారం పూతలపట్టులో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఐదుగురు దళితులకు ఎమ్మెల్యేలుగా పోటీ చేయడానికి అవకాశం కల్పించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన ఐదేళ్లలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 10,787 మందికి సచివాలయాల ఉద్యోగాలు, 20 వేల మందికి వలంటీర్లుగా, 250 మందికి యూనివర్సిటీల్లో ఉద్యోగాలు కల్పించినట్టు వివరించారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ సభ్యులు పేద, దళితుల భూములను ఆక్రమించుకున్నారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి న్యాయం చేసినట్టు తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు. మంచి చేసిన వారికే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మంచి చేశాం.. మానవత్వంతో ఆలోచించండి


పరమసముద్రంలో ప్రచారం చేస్తున్న కేఆర్‌జే భరత్

కుప్పం: 'రాజకీయాలు, పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికీ మంచి చేశాం.. మానవత్వంతో ఆలోచించి వైఎస్సార్ సీపీని ఆదరించండి' అని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృష్ణరాఘవ జయేంద్ర భరత్ (కేఆర్‌జే భరత్) కోరారు. ఆయన ఆదివారం కుప్పం మున్సిపాలిటీలోని 8వ వార్డు పరమసముద్రంలో ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ మంచి జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెంది పేదరికాన్ని నిర్మూలించాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్య ఉద్దేశమన్నారు. అలాంటి ముఖ్యమంత్రి ఆంధ్ర రాష్ట్రానికి చాలా అవసరమని పేర్కొన్నారు. ఆయనను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. తద్వారా రాష్ట్రంలో పేదరికం తగ్గుముఖం పడుతుందని వివరించారు. కుప్పం నియోజకవర్గంలో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రెడ్డెప్పను గెలిపించాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలోని ల్యాబ్



పీహెచ్‌సీలోని ఆపరేషన్ గదిలో ఉన్న వసతులు



పీహెచ్‌సీలో అందుబాటులోని మందులు, మాత్రలు



నేనున్నానని.. మీకేం కాదని

గతంలో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా ఉండేది. ఏదైనా జబ్బు చేస్తే ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వంలో ఆ పరిస్థితి మారింది. పేదల ఆరోగ్యమే పరమావధిగా భావించి వైద్య ఆరోగ్యశాఖలో పెను మార్పులు చేసింది. నాడు–నేడు కింద ఆస్పత్రులను కార్పొరేట్‌ను తలదన్నేలా తీర్చిదిద్దింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటుచేసి పల్లెకు వైద్య సేవలను తీసుకొచ్చింది. ఫ్యామిలీ ఫిజీషియన్ అంటూ ఇంటికే డాక్టర్‌ను పంపించింది. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వ్యాధులను జల్లెడ పట్టించి వైద్యసేవలు అందించింది. పీహెచ్‌సీలు 24 గంటలూ పని చేసేలా చర్యలు తీసుకుంది.

– చిత్తూరు రూరల్

- గత ప్రభుత్వాల హయాంలో పేదలకు వైద్యం అమాడదూరం
- ప్రస్తుత ప్రభుత్వంలో ఆస్పత్రుల్లో పెను మార్పులు
- విలేజ్ హెల్త్ క్లినిక్‌తో పల్లెకు వైద్యం
- ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటికే డాక్టర్
- జగనన్న ఆరోగ్య సురక్షతో వ్యాధుల జల్లెడ
- పీహెచ్‌సీలో 24 గంటలు వైద్యం

చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం ఒకటి జిల్లా, నాలుగు ఏరియా ఆస్పత్రులు, 7 సీహెచ్‌సీలు, 15 అర్బన్ హెల్త్ సెంటర్లు, 50 పీహెచ్‌సీలు, 464 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. వీటిలో ప్రతి రోజూ 10 వేలకు పైగా ఓపీలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో


చౌడేపల్లి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పీహెచ్‌సీలు మధ్యాహ్నానికే మూత పడేవి. మందులు, సిబ్బంది కొరత వేధించేది. డాక్టర్లు ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి. ప్రస్తుత ప్రభుత్వం నాడు–నేడుతో ఆస్పత్రుల రూపు రేఖలు మార్చేసింది. ప్రతి పీహెచ్‌సీలోను ఇద్దరు డాక్టర్లతోపాటు 14 మంది సిబ్బందిని నియమించింది. ఫేషియల్ అటెండెన్స్ తీసుకొచ్చింది. పీహెచ్‌సీలు 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకుంది. గతంలో వంద రకాల మాత్రలు ఉంటే.. ఇప్పుడు 214 రకాల మాత్రలు ఉంటున్నాయి. గతంలో హిమోగ్లోబిన్, మధుమేహం, హెచ్‌ఐవీ, యూరిన్, గళ్ల, మలేరియా పరీక్షలు చేస్తుంటే ఇప్పుడు 60 రకాల పరీక్షలు చేస్తున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో వైద్య ఆరోగ్య సేవలు ప్రజల ముంగిటకే చేరాయి. డాక్టర్లు పల్లె బాట పట్టారు. ప్రణాళిక ప్రకారం ఒక డాక్టర్, వైద్య సిబ్బంది కలిసి 104 వాహనంలో ఉదయం 9 గంటలకే పల్లెకు చేరుకుని మధ్యాహ్నం వరకు ఓపీలు చూస్తున్నారు. ఆపై అంగన్‌వాడీ, వాటర్ ట్యాంకులను పరిశీలిస్తున్నారు. ఆరోగ్యశ్రీ కేసులు, మంచానికే పరిమితమైన

జగనన్న ఆరోగ్య సురక్షతో రోగాల జల్లెడ

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినూత్నంగా చేపట్టింది. ఇందులో వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేశారు. తర్వాత క్యాంపులు నిర్వహించి పరీక్ష ఫలితాల ఆధారంగా స్పెషలిస్ట్ డాక్టర్లతో చికిత్స చేయించారు. తద్వారా మధుమేహం, బీపీ వంటి దీర్ఘకాలిక రోగాలు అధికంగా వెలుగులోకి వచ్చాయి. వారికి మెరుగైన వైద్యం అందించే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుంది. తీవ్ర పరిస్థితులున్న వారిని ఆరోగ్యశ్రీ కింద ఆస్పత్రులకు రెఫర్ చేయించారు. మొదటి విడతలో 494 క్యాంపులు నిర్వహించి 2,07,539 మందికి వైద్య సేవలు అందించారు. రెండో విడతలో 329 క్యాంపులు చేపట్టి 1,19,687 మందికి వైద్యం చేశారు.

వారికి వైద్య సేవలు అందించి మందులు, మాత్రలు పంపిణీ చేస్తున్నారు.

పల్లెకొచ్చిన విలేజ్ హెల్త్ క్లినిక్

వైద్య ఆరోగ్య సేవలను పల్లె ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రస్తుత ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తీసుకువచ్చింది. ఒక్కో భవనాన్ని రూ.20.80 లక్షలతో నిర్మించి ఆధునిక వసతులు కల్పించింది. అదేవిధంగా మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ఉంటారు. వీరు ఓపీ సేవలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు, టెలీగైనిక్ సేవలు అందిస్తున్నారు. అలాగే పిల్లలకు టీకాలు వేయడం, తల్లీబిడ్డల సంరక్షణ, వైద్య ఆరోగ్య శాఖ చేపట్టే సర్వేలు తదితర పనులు చేస్తున్నారు. క్లినిక్‌లో 172 రకాల మాత్రలు అందుబాటులో ఉన్నాయి.

మరిన్ని సేవలతో...



- వైఎస్సార్ ఆరోగ్యశ్రీకి మరింత ప్రాధాన్యత ఇచ్చింది. 1,059 జబ్బులకు పరిమితమైన ఆరోగ్యశ్రీని 3,255 వ్యాధులకు వైద్యం అందించేలా చర్యలు తీసుకుంది. వైద్య ఖర్చుల పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచింది. ఆసరా పేరుతో జీవన భృతిని అందిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులకు సైతం ఆరోగ్యశ్రీ ద్వారా నిధులు సమకూరుతున్నాయి.
- 104, 108 సేవల సంఖ్య పెరిగింది. మండలానికి ఒకటి చొప్పున 104 వాహనాలు 44, 108 వాహనాలు 33 ఉన్నాయి. అలాగే 102 (తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్) సేవలను మరింత మెరుగుపరిచారు. ఇవి ప్రస్తుతం 16 ఉన్నాయి. గతంలో వీటిని తల్లి, బిడ్డను ఇంటికి తీసుకెళ్లేందుకు మాత్రమే వినియోగించే వారు. ఇప్పుడు హైరిస్క్ గర్భిణులను ఆస్పత్రులకు తీసుకెళ్లేందుకు, ప్రసవ సమయానికి ఆస్పత్రికి తీసుకొచ్చేందుకు కూడా వాడుతున్నారు.
- గుండెపోటుకు చెక్ పెట్టాలని ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేసింది. ఇవి జిల్లాలో 11 ఉన్నాయి. గుండెపోటు వచ్చిన వెంటనే రోగిని వీటికి తీసుకొస్తే రూ.40 వేల విలువ చేసే ఇంజెక్షన్ వేస్తున్నారు. తద్వారా గుండెను భద్రం చేసి పేదల ప్రాణాలను కాపాడుతున్నారు.
- కంటి వెలుగు కింద విద్యార్థులు, అవ్వాతాతలకు పల్లెలోనే కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తున్నారు.
- రక్తహీనత ఉన్న గర్భిణులకు రూ.2 వేల విలువైన వ్యాక్సిన్, టీకాలు వేస్తున్నారు.

జిల్లా సమాచారం

- ఒకటి జిల్లా, నాలుగు ఏరియా ఆస్పత్రులు
- ఏడు సీహెచ్‌సీలు, 15 అర్బన్ హెల్త్ సెంటర్లు
- 464 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు
- ప్రతి పీహెచ్‌సీలోనూ 14 మంది సిబ్బంది నియామకం

అర్బన్ హెల్త్ సెంటర్లు

జిల్లాలో 15 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉంటే నాలుగు సెంటర్లు ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. 11 భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. ఇందులో ఆరు భవనాల నిర్మాణం పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ కేంద్రాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయి. వీటిలో ఓపీలతో పాటు 60 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. 172 రకాల మందులు అందుబాటులోకి తెచ్చారు. ప్రతిరోజూ స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు చేస్తున్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా



సీఎం జగనన్న మాలాంటి పేదల ఆరోగ్యానికి భరోసా ఇచ్చారు. టీడీపీ హయాంలో పీహెచ్‌సీల్లో డాక్టర్లు, మందులు లేక ఇబ్బంది పడే వాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఆస్పత్రులు మారాయి. డాక్టర్లు పల్లెకే వచ్చి మా బాగోగులు చూస్తున్నారు. పేదల ఆరోగ్యం గురించి ఇంతగా ఆలోచించే నాయకుడు ఎవరూ ఉండరు.

– గౌరీ, వైఎస్ గేట్, ఐరాల

ఆయుష్ పోస్తున్నారు



బంధువులు, కుటుంబ సభ్యులే పట్టించుకోని ఈ రోజుల్లో పేదలు ఆరోగ్యంగా ఉండాలని ఆ బిడ్డ జగన్ పరితపిస్తున్నాడు. తండ్రికి మించి పేదలకు సేవ చేస్తున్నారు. ఆరోగ్యశ్రీతో మాలాంటి వాళ్లకు ఆయుష్ పోస్తున్నారు. డాక్టర్లు ఇంటికొచ్చి ఆరోగ్యం ఎలా ఉందని పలకరించి మందులు, మాత్రలు ఇస్తున్నారు.

– టి.రామ్మూర్తి, జీడీ నెల్లూరు

పేదల ప్రాణాలకు భరోసా



గతేడాది తలుపుతట్టి వైద్య పరీక్షలు చేశారు. తర్వాత క్యాంపు ఉందని రమ్మన్నారు. అక్కడ స్పెషలిస్ట్ డాక్టర్లు మంచిగా చూసి మాత్రలు, మందులు ఇచ్చారు. మళ్లీ రెండో విడత కూడా ఊరికొచ్చి వైద్యం చేశారు. ఏ ప్రభుత్వమూ కూడా ఇలాంటి వైద్య సేవలు అందించలేదు. పేదల ప్రాణాలకు జగనన్న భరోసా కల్పించారు.

– పయణి, పెరుమాళ్లకండ్రిగ, చిత్తూరు మండలం

పేదలు.. పెత్తందార్లకు మధ్యే ఎన్నికలు





జగనన్న పాటకు గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి, ఎంపీ రెడ్డెప్ప


వెంకటాపురంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థిని గజమాలతో సత్కరిస్తున్న ప్రజలు

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి
- సంక్షేమానికి చిరునామా జగన్ పాలన
- మీకు మంచి జరిగితేనే జగనన్నకు ఓటు వేయండి
- అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్న ప్రజలు

శ్రీరంగరాజపురం : రాష్ట్రంలో పేదలకు, పెత్తందారులకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఆయన ఆదివారం ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మితో కలిసి వెంకటాపురం, ఉడమలకుర్తి, చిల్లమాకులపల్లి, పిళ్లారికుప్పం, జీఎంఆర్.పురం పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వారికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. నారాయణస్వామి మాట్లాడుతూ అవినీతి, బినామీ, దోపిడీదారులు కలిసి వస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామా అని తెలిపారు. చంద్రబాబు పరిపాలన అంతా అవినీతిమయమని పేర్కొన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాటను ఏనాడూ నెరవేర్చలేదని, ఇప్పుడు మరోసారి మోసం చేసేందుకు వస్తున్నాడని పేర్కొన్నారు. మీ ఇంటిలో మేలు జరిగి ఉంటేనే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని, ఎంపీ అభ్యర్థి రెడ్డెప్పను గెలిపించాలని కోరారు.

కరువుకు కేరాఫ్ చంద్రబాబు

ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ చంద్రబాబు, కరువు కవల పిల్లలని విమర్శించారు. ఆయన హయాంలో ఏనాడూ సరైన సమయంలో వర్షాలు కురవలేదని, పంటలు పండక కరువు పరిస్థితులు నెలకొన్నాయని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చేందుకు ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటుచేశారని వివరించారు. మంచిని గుర్తించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి ఆదరించాలని కోరారు.

మీకు మంచి జరిగితేనే జగనన్నకు ఓటు వేయండి

మీకు, మీ కుటుంబానికి జగనన్న ప్రభుత్వం ద్వారా మంచి జరిగి ఉంటేనే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడానికి తనను జగనన్న ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. సుస్థిర పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి జీఎంఆర్.పురం గిరిజన మహిళలతో కలిసి జగనన్న పాటకు నృత్యం చేశారు. కార్యక్రమానికి పార్టీ మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు చిట్టి, విజయ, అనిత, లోకేష్, చిరంజీవి, ఎంపీటీసీ ఏసమ్మ, శివయ్య, మాజీ జెడ్పీటీసీ గురవారెడ్డి, మాజీ మండల కన్వీనర్ అనంతరెడ్డి, నాయకులు సురేష్‌వర్మ, కాలప్ప, చిరంజీవిరెడ్డి, మహేష్, ఏకాంబరం, లోకయ్య, గోవిందయ్య, జానర్దన్, రామచంద్ర యాదవ్, చిట్టి, నాగరాజుశెట్టి, రిషి, గిరి, రమేష్, హేమాద్రి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షయ నివారణే లక్ష్యం

చిత్తూరు రూరల్: క్షయ నివారణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి తెలిపారు. చిత్తూరు నగరంలో ఆదివారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్య శాఖ అధికారులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ క్షయకు సరైన చికిత్స తీసుకోకుంటే ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందన్నారు. వ్యాధి మనిషిని పూర్తిగా బలహీనుడిగా మార్చేస్తుందని చెప్పారు. క్షయ లక్షణాలను తొలి దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవడం ఉత్తమమన్నారు. అలక్ష్యం చేస్తే మహమ్మారిలా విస్తరించే ప్రమాదం ఉందన్నారు. క్షయ నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలు సహకరించాలన్నారు. ప్రైవేటు ఆస్పత్రులు, విద్యార్థులు కూడా వాడవాడల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, డీఐఓ రవిరాజు, అధికారులు గుణశేఖర్, జార్జ్, జాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

నగరి : మున్సిపాలిటీ పరిధిలోని కొండచుట్టు మండపం సమీపంలో ఆదివారం ప్రైవేట్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో వి.ధనపాల్ (58) అనే వ్యక్తి మృతి చెందాడు. సీఐ సురేష్ కథనం మేరకు.. నింద్ర మండలం కొత్త ఆరూరుకు చెందిన ధనపాల్ పుత్తూరు వైపు నుంచి నగరికి ద్విచక్ర వాహనంలో వెళుతున్నాడు. కొండచుట్టు మండపం సమీపంలో తిరుపతి వైపు వేగంగా వెళుతున్న ప్రైవేటు బస్సు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ధనపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించి బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.


క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని మంత్రి రోజా తెలిపారు. ఆమె ఆదివారం విజయపురంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. – విజయపురం

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తాం

విజయపురం: ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని విజయపురం దళితవాడకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. వారు ఆదివారం మంత్రి ఆర్కే రోజా ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మంత్రి రోజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పరిపాలన, నగరిలో మంత్రి రోజా చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను చూసి వైఎస్సార్ సీపీలో చేరినట్టు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో ప్రభుదాస్, సరసు, అపున్, రాజ్, సంగీత, మనో కుమార్ చంద్రలేఖ, అరుల్ దాస్ మహాలక్ష్మి, ఎస్.సిద్ధయ్య, వై.విజయ్, టి.పచ్చమ్మ, ఎం.చిన్నపొన్ను, ఎం.వెంకటేష్ ఇ.శ్రీనివాసులు టి.సంజీవి ఉన్నారు.

పశువుల కొట్టం దగ్ధం

కుప్పం రూరల్ : మండలంలోని బైరుగానిపల్లెలో ఆదివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో పశువుల కొట్టం దగ్ధమైంది. గ్రామానికి చెందిన మునెమ్మ ఇంటి సమీపంలో పశువుల కొట్టం ఉంది. అక్కడ ఆదివారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయింది. ఆవుకు గాయాలయ్యాయి. గ్రామస్తులు ఆవును రక్షించారు. షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగిందని, రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పలమనేరు: పట్టణంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ వరుణ్ ఐటీఐ కళాశాల వెనుక పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు తెలిపారు. పలమనేరుకు చెందిన ఏడుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5 వేల నగదు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. పట్టుబడిన వారిలో హోంగార్డు మహేష్ ఉండడం గమనార్హం. వీరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.